పర్యావరణ వారోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపకమిషనర్ వంశీకృష్ణ, సంక్షేమ మండలి ప్రతినిధులు

హఫీజ్‌పేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ వంశీకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ అవసరమన్నారు. వాతావరణాన్ని మెరుగుపరిచే మార్గాలను ప్రోత్సహించాల్సిన అశసరమున్నదన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ పులి అమృత్ గౌడ్ మాట్లాడుతూ మానవునికి ప్రకృతికి విడదీయరాని అనుబంధం ఉన్నదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన తమవంతు కృషి చేస్తూ, సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి ప్రతినిధులు పి.అశోక్, షేక్ బాజీ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

హఫీజ్‌పేట్: చందానగర్ పాపిరెడ్డి కాలనీలో హోలిస్టిక్ హాస్పటల్, సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడర్టి, చైల్డ్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని స్థానికులు, పాఠశాల విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ తారిక్ నేతృత్వంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నాగార్జున మార్కెంటింగ్ ఎగ్జిక్యూటివ్ నర్సింగ్, సీడబ్ల్యూసీ, చైల్డ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సు



ఏజీవర్సిటీ: మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటలలో కలుపు యాజమాన్య పద్ధతులలో నూతన పోకడలను అనుసరించాలని మొక్కజొన్న శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌కే మాలిక్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పంటల కలుపు యాజమాన్యంపై మూడు రోజుల అవగాహన సదస్సును నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కలుపు మొక్కల నివారణపై పరిశోధకులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి, అఖిలభారత ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్‌పీ దూబే, డాక్టర్ ఎస్‌కే జలాలి,డాక్టర్ పీజీ షా,డాక్టర్ సిమర్జీత్ కౌర్,వి శాస్త్రవేత్తలు అధికారులు పాల్గొన్నారు.

వానొస్తే తప్పని తిప్పలు

భారీగా ట్రాఫిక్ జాం

నానక్‌రాంగూడ రోటరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు బారులుదీరిన వాహనాలు



గచ్చిబౌలి: వానొస్తే ఔటర్‌రింగ్ రోడ్డుపై తిప్పలు తప్పడం లేదు. సాయంత్రం చిన్నపాటి వర్షం వచ్చినా ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జాం నెలకొంటోంది. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కిలోమీటరుకు పైగా ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నానక్‌రాంగూడ రోటరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు బంపర్ టు బంపర్ అన్నట్లుగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని పలు ఎంఎన్‌సీ కంపెనీల నుంచి వేల సంఖ్యలో ఐటీ, ఐటీయేతర ఉద్యోగులు వేల సంఖ్యలో ఇళ్లకు తిరుగుముఖం పడతారు. కార్లు, బైక్‌లు, క్యాబ్స్ క్యూకడుతుంటాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే వారు నానక్‌రాంగూడ రోటరీ నుంచి ఖాజాగూడ మీదుగా వెళతారు. కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వారు నానక్‌రాంగూడ రోటరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు వెళతారు. ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి, మాదాపూర్ ఐటీ జోన్, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ నుంచి వచ్చే వాహనాలతో గచ్చిబౌలి జంక్షన్‌లో జాం నెలకొంటోంది. దీంతో నానక్‌రాంగూడ రోటరీ నుంచి వచ్చే వాహనాలు ఔటర్‌పై బారులుదీరుతున్నాయి. గురువారం సాయంత్రం ట్రాఫిక్ జాంతో ఔటర్ రింగ్ రోడ్డుపై నెలకొన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు నానా తంటాలు పడ్డారు.

నత్తనడకన ఫ్లై ఓవర్ పనులు

ఔటర్‌కు అనుసంధానంగా కొండాపూర్ వైపు వెళ్లేందుకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. టీఆర్‌ఎస్ హయాంలో పనులు ప్రారంభించినప్పటికీ నిర్ణీత కాలంలో పనులు పూర్తి కాలేదు. ఫ్లై ఓవర్‌ను త్వరితగతిన పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కల్గుతుంది. ఔటర్ నుంచి కొండాపూర్ రోడ్డుకు, కొండాపూర్ రోడ్డు నుంచి ఔటర్‌పైకి ఎలాంటి అంతరాయం లేకుండా చేరుకోవచ్చు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఫ్లైఓవర్ పనులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

హైటెక్స్‌లో పెరల్, జెమ్ ఫెయిర్ -2024 ప్రారంభం





మాదాపూర్: సాంస్కృతిక వారసత్వంలో రత్నాలు, ఆభరణాల ప్రాముఖ్యత ఎక్కువ అని ఇండియా ఇన్ఫార్మా మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ జువెలరీ పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 2024ను శుక్రవారం హైదరాబాద్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిమళ హనానూతన్, అసోసియేషన్ అధ్యక్షులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి రత్నాలు, ఆభరణాల ఎగుమతులను యూఎస్ 75 బిలియన్ డాలర్లకు(రూ.6.2 లక్షల కోట్లు) పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌జెఎం అధ్యక్షుడు మహేందర్ తాయల్, జంట నగరాల జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాస్ చరణ్, తెలంగాణ బులియన్ జెమ్, జువెలరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీశ్ పర్షద్ వర్మ, ఎగ్జిబిషన్ కన్వీనర్ ముఖేష్ అగర్వాల్, తెలంగాణ పాన్ బ్రోకర్ జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్

అమీన్‌పూర్ సీఐ నాగరాజు

పటాన్‌చెరు టౌన్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అమీన్‌పూర్ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ లోని ఎల్లంకి కళాశాల్లో జూన్ 9వ తేదీ గ్రూప్–1 పరీక్ష నేపథ్యంలో సీఐ నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆదివారం ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను ఎగ్జామ్ హాల్ లోనికి అనుమతిస్తారని, 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేయడం జరుగుతుందన్నారు.10 గంటల తర్వాత ఒక సెకండ్ ఆలస్యంగా వచ్చినా అనుమతించడం జరగదన్నారు. ఇందులో 840 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



రాయదుర్గం ఎస్సీకాలనీలో కుంగిన మ్యాన్‌హోల్

రాయదుర్గం: రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ మూత కుంగిపోవడంతో స్థానికులు అవస్థల పాలవుతున్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని ఎస్సీకాలనీలో బస్తీ అంతర్గత రోడ్డుపై ఈ సమస్య నెలకొంది. వర్షాలు కురుస్తుండడంతో.. వరద నీటి తాకిడికి మ్యాన్‌హోల్ కనపడకుండా పోతుందని ఎవరైనా ఇందులో పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ మూత కుంగిపోయి లోపలికి పడిపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఈరోజు, రేపు అంటూ కాలం వెళ్ళదీస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మ్యాన్‌హోల్‌పై వెంటనే మూత ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి



పోలీసు అధికారికి ఉత్తమ సేవా పతకం అందిస్తున్న సీపీ అవినాష్ మహంతి



ఉత్తమ సేవా పతకం పొందిన ట్రాఫిక్ పోలీసు

- సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి
- 75 మంది పోలీసులకు సేవా పతకాల అందజేత

రాయదుర్గం: పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం 75 మంది పోలీసులకు సేవా పతకాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులను నిర్వహించాలన్నారు. మొత్తం 75 మందికి సేవా పతకాలు అందించగా అందులో మహోన్నత సేవా పతకాలు ముగ్గురికి, ఉత్తమ సేవా పతకాలు 18 మందికి, 54 మందికి సేవా పతకాలు అందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, డీసీపీలు నర్సింహ్మా, ప్రసాద్, సృజన, సాయిశ్రీ. ఎల్‌సి నాయక్, డి శ్రీనివాస్, ఏడీసీపీ ఎస్‌కే షమీర్, ఇన్‌స్పెక్టర్లు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

9న కూచిపూడి నృత్యప్రదర్శన

రాయదుర్గం: నాట్యగురువు ఉషా గోరేటి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన యువ ప్రజ్ఞాశాలి ధృతి ముదిగొండ నృత్యప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు నృత్యప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

10న ఏజీ వర్సిటీ స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరవ స్నాతకోత్సవంను ఈ నెల 10 సోమవారం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇంచార్జీ ఉపకులపతి ఎం రఘునందన్‌రావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాస్‌శెట్టి పాల్గొంటారన్నారు .ఇందులో 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను,165 మంది విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలని అందజేయనున్నట్లు తెలిపారు.వీరితో పాటు పీజీ ,పీహెచ్‌డీ,యూజీ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశం కోసం జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హత్య కేసులో పదేళ్లు జైలు

గచ్చిబౌలి: హత్య కేసులో వ్యక్తికి పదేళ్లు జైలుశిక్ష పడింది. ఇద్దరూ కొబ్బరి బొండాల వ్యాపారులు. తాగిన మైకంలో చిన్న ఘర్షణ జరగడంతో కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో కాలుపై నరకడంతో తీవ్ర రక్తస్రావంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసులో రెండేళ్ల అనంతరం 6వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సి.పావని నిందితుడికి పదేళ్ల జైలు, 2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. గచ్చిబౌలి సీఐ ఎస్.ఆంజనేయులు తెలిపిన ప్రకారం .. ఓ కొబ్బరి బొండాల వ్యాపారి వద్ద సీహెచ్ మహేశ్వర్‌రావు, ఒసురు చిట్టిబాబు (53)లు పని చేస్తున్నారు. వీరివురూ కొండాపూర్ ఆనంద్‌నగర్ కాలనీలోని సుప్రీం మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో చిట్టిబాబు కొడుకు దుర్గాప్రసాద్ హాస్టల్‌కు రాగా మహేశ్వర్‌రావు తిట్టడంతో చిట్టిబాబు బాధపడ్డాడు. మరుసటి రోజు ఇద్దరు మద్యం సేవించి హాస్టల్‌కు వచ్చారు. చిన్న విషయంలో మాటామాటా పెరగడంతో క్షణికావేశంలో చిట్టిబాబు కొబ్బరి బొండం నరికే కత్తితో మహేశ్వర్‌రావు కుడికాలు తొడపై నరికాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో మహేశ్వర్‌రావును హాస్టల్ సూపర్‌వైజర్, రూమ్ మేట్ విక్రమ్, చిట్టిబాబులు 108 అంబులెన్స్‌లో కొండాపూర్ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. రెండేళ్ల పాటు సాగిన ఈ కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడింది.ఈ కేసులో అడిషనల్ పీపీ నాగేశ్వర్‌రావు, అప్పటి ఇన్‌స్పెక్టర్ జి.సురేష్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ ఆంజనేయులు, సీడీఓ ప్రవీణ్ కుమార్, లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ కృష్ణారెడ్డి విధులు నిర్వహించారు.

వర్షం పడిందా.. వరదే..



రింగురోడ్డు సమీపంలో నిల్వ ఉన్న నీరు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి–బొల్లారం గ్రామాల మధ్య ఉన్న రింగురోడ్డు సమీపంలో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంతవాసులు వాపోతున్నారు. భారీ వర్షాలు పడితే సమస్య తీవ్రంగా ఉంటుందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతి కమిటీ సమావేశం

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పండుగలు శాంతియుతంగా చేసుకోవాలని సూచించారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 07 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు



ట్యాంక్ వద్ద విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని ఈడబ్ల్యూయస్ ట్యాంక్ వద్ద విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు పడి ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. కొమ్మల బరువుకు 11కెవి విద్యుత్ తీగలు కిందకు సాగిపోయాయి. మరోచోట చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడి నెలలు గడుస్తున్నా దానిని తొలగించటం లేదు. ఆ కొమ్మ పూర్తిగా ఎండిపోయి ఉంది. మీటర్ రీడింగ్ కోసం వచ్చే సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. గాలివానలకు చెట్ల కొమ్మలు విరిగి వైర్లపై పడటం, ఊగటం వల్ల షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వస్తున్నాయని వాపోయారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి కల్యాణ వేడుక ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం విష్వక్సేనారాధనం, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, తదుక్త హవనం, పూర్ణాహుతి, ఉత్సవ మూర్తులకు స్నపన పూజలు చేశారు. సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. రాత్రి శ్రీవారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రూప్ 1 పరీక్షలకు ఆర్టీసీ బస్సులు సిద్ధం

మూసాపేట: కూకట్‌పల్లి డిపో నుంచి గ్రూప్ 1 పరీక్ష కేంద్రానికి అన్ని రూట్‌లలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్ తెలిపారు. ఒకే ప్రాంతం నుంచి సుమారు 30 మంది అభ్యర్థులు ఉంటే 1.5 ఫెయిర్ ఛార్జీతో బస్సులు సెంటర్ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడకుండా పరీక్ష కేంద్రం వరకు బస్సులు నడిపిస్తున్నామని, గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్లు గుంతలమయం

మందకొడిగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు

- చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజల వినతి



అధ్వానంగా బొల్లారం రోడ్డు

జిన్నారం(పటాన్‌చెరు): చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడవుతున్నాయి. దీనికితోడు ఏళ్ల తరబడి జరుగుతున్న మిషన్ భగీరథ పనులతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రభుత్వం సమస్య పరిష్కరించాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

◆ జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉండటంతో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. 22 వార్డులున్నాయి. మూడేళ్ల నుంచి మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. రోడ్ల పక్క నుంచి గుంతలు తీస్తూ పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. ఈ పనులు త్వరంగా పూర్తి కాకపోవటంతో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో ఉన్న రోడ్లు పూర్తిగా గుంతలుగా మారాయి. బొల్లారంలోని మిషన్ భగీరథ ట్యాంకు నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన రోడ్లు గుంతలు పడ్డాయి. గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. కాగా మున్సిపల్ పరిధిలో నిత్యం వాహనాల రాకపోకలతో రోడ్లు రద్దీగా ఉంటాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారుల ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావు. కనీసం రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

> **త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తున్నాం**
>
> మిషన్ భగీరథ పనులు జరుగుతుండడంతో రోడ్లు వేయడానికి ఆలస్యం జరుగుతుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు సూచనలు చేస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – మంగతాయారు, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

ముందస్తు చర్యలు తీసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్ అధికారులను కోరారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలో జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలవడంతో ఆ ప్రాంతంలో ఆమె పర్యటించారు. జేసీబీతో ఈ నీటిని కాలువలోకి మళ్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షంపడినప్పుడు జాతీయ రహదారిపై పలుచోట్ల నీరు నిలుస్తుందన్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.



జాతీయ రహదారిపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

యువకుడు అదృశ్యం



దుర్గారావు

మియాపూర్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రి కొంతమూరు గ్రామానికి చెందిన దుర్గారావు దేవరకొండ(25) మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని ఎస్‌ఆర్‌ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అత్త వెంకటలక్ష్మీ ఇంట్లో ఉంటున్నాడు. గత నెల 29న మధ్యాహ్నం 1 గంట సమయంలో దుర్గారావు ఇంటినుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందిన అక్క వెంకటలక్ష్మీ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.